ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :145 శనివారం మార్చి 21 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com


PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## కేరళలో షిజెల్లా విజృంభణ

●చిన్నారి మృతి, అప్రమత్తమైన యంత్రాంగం
●కోజికోడ్ జిల్లాలో కేసులు కలకలం
●సంపర్కంలో ఉన్న వారిపై కఠిన నిఘా
●అంగన్‌వాడీలు మూసివేత, అవగాహన కార్యక్రమాలు వేగవంతం



కోజికోడ్, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): కేరళలో షిజెల్లా బ్యాక్టీరియా వ్యాప్తి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కోజికోడ్ జిల్లాలో మూడేళ్ల చిన్నారి ఈ వ్యాధి బారిన పడి మృతి చెందడం పరిస్థితిని మరింత భయానకంగా మార్చింది. వైద్య కళాశాలలో చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు కోల్పోవడంతో ఆరోగ్యశాఖ అత్యవసర చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా వైద్య బృందాలు అప్రమత్తమై పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. మొదట ఈ చిన్నారి సాధారణ ఉదర సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు భావించిన వైద్యులు, పరీక్షల అనంతరం షిజెల్లా బ్యాక్టీరియా సంక్రమణను గుర్తించారు. చిన్నారితో సన్నిహితంగా ఉన్న సుమారు 11 మందికి కూడా ఈ వ్యాధి సోకిన అవకాశాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో వారిని వైద్య పర్యవేక్షణలో ఉంచి, నిరంతర ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు.ప్రస్తుతం పలు ఆసుపత్రుల్లో ఐదుగురు చిన్నారులు పరిశీలనలో ఉన్నారు. వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. వృద్ధుల ఆరోగ్య పరిస్థితులను కూడా వైద్యులు పరిశీలిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పరిశుభ్రతపై సూచనలు ఇస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీలను తాత్కాలికంగా మూసివేశారు. ప్రజలు కలుషిత నీటిని తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.షిజెల్లా లక్షణాలుగా వాంతులు, విరేచనాలు, జ్వరం, కడుపు నొప్పి, మలంలో రక్తం కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు. పరిస్థితి విషమించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ విజ్ఞప్తి చేసింది.



## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

- మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ
- జకాత్, ఫిత్రా దానధర్మాలు ఆదర్శమని వ్యాఖ్య
- మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబాటు



హైదరాబాద్, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ంజాన్ మాసం ఆధ్యాత్మికతకు, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని సీఎం అన్నారు. ఈ నెలలో ముస్లింలు పాటించే కఠిన ఉపవాసాలు, క్రమశిక్షణతో చేసే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా రూపంలో పేదలకు సహాయం చేయడం మానవాళికి గొప్ప సందేశమని ఆయన తెలిపారు. ఈ ఆచారాలు సమాజంలో సహానుభూతి, సేవాభావాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.తెలంగాణ రాష్ట్రం గంగా–జమునా సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని సీఎం పేర్కొన్నారు. అన్ని మతాలు, వర్గాలు కలిసిమెలిసి జీవించే సంస్కృతి రాష్ట్రానికి ప్రత్యేకతని ఆయన గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సామరస్య వాతావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఎం అన్నారు. ప్రజలంతా పరస్పర గౌరవంతో, సహకారంతో జీవిస్తే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ అందరికీ శాంతి, సుఖసంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ముగింపులో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ కలిసిమెలిసి ఆనందంగా జీవించాలని ప్రార్థించారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు కలగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకున్నారు.

## సంకల్పంతో రూపుదిద్దుకున్న తెలంగాణ బడ్జెట్..

- సమగ్రాభివృద్ధికి బ్లూప్రింట్
- రూ. 3.24 లక్షల కోట్ల భారీ ప్రణాళిక
- ప్రతి వర్గానికి సంక్షేమంఅభివృద్ధి లక్ష్యం
- రైతు, మహిళ, యువతకు ప్రత్యేక ప్రాధాన్యం



హైదరాబాద్, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రతిపాదించింది. రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అన్ని కీలక రంగాలకు సమతుల్యంగా కేటాయింపులు చేస్తూ ఈ బడ్జెట్ రూపొందించబడింది. పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు వెల్లడించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి

2

## బడ్జెట్ ఆమోదం లేకుండా వేల కోట్ల ఖర్చు





- మండలి చైర్మన్‌కు మల్లన్న ఫిర్యాదు
- ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘనపై తీవ్ర ఆరోపణలు
- క్యాగ్ నివేదికల ఆధారంగా కీలక అంశాల వెల్లడి
- విచారణకు, కఠిన చర్యలకు డిమాండ్

హైదరాబాద్, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో గత పదేళ్లుగా శాసనసభ ఆమోదం లేకుండా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఆరోపిస్తూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ తక్షణ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం శాసనసభ ఆమోదం లేకుండా కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులు వినియోగించడం చట్ట విరుద్ధమని మల్లన్న పేర్కొన్నారు. అయినప్పటికీ 2014 నుంచి 2024 వరకు ఈ నియమాలను ఉల్లంఘిస్తూ భారీగా ఖర్చులు చేసినట్లు ఆరోపించారు. ఇది ఆర్థిక క్రమశిక్షణను పూర్తిగా దెబ్బతీసిందని అన్నారు.కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలను ఉదహరిస్తూ మల్లన్న పలు కీలక వివరాలను వెల్లడించారు. 2014–15 నుంచి 2018–19 మధ్య సుమారు 84,650 కోట్ల రూపాయల అదనపు ఖర్చు శాసనసభ ఆమోదం లేకుండా జరిగినట్లు పేర్కొన్నారు. 2018–19లో 29,133 కోట్లకు పైగా, 2019–20లో 47,896 కోట్లకు పైగా అధిక వ్యయం జరిగిందని తెలిపారు.అలాగే బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోయినా పలు పథకాల పేరిట నిధులు మళ్లించినట్లు ఆరోపించారు. ఉపాధి హామీ పథకం, విద్యుత్ రంగం, కార్పొరేషన్లు, ఆరోగ్య అత్యవసరాలు వంటి విభాగాల్లో భారీగా నిధులు వినియోగించినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలు శాసనసభ అధికారాలను అవమానించే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్లన్న డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశాన్ని సభ హక్కుల ఉల్లంఘనగా పరిగణించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజాధనాన్ని నియంత్రణ లేకుండా ఖర్చు చేసే పరిస్థితిని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## చింతమడకలో శ్రీరామ నవమి వేడుకలకు కేసీఆర్‌కు ఆహ్వానం

- ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఆహ్వానం
- ఎర్రవెల్లిలో కలిసిన ఆలయ ప్రతినిధులు
- గ్రామంలో భక్తి వాతావరణం నెలకొనున్న వేడుకలు



సిద్ధిపేట, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): సిద్ధిపేట జిల్లా రూరల్ మండలంలోని చింతమడక గ్రామంలో నిర్వహించనున్న శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మరియు శ్రీరామ నవమి వేడుకలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆలయ కమిటీ ఆహ్వానించింది. ఈ నెల 25, 27 తేదీలలో జరిగే ఈ కార్యక్రమాలకు ఆయన హాజరు కావాలని కోరుతూ ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆకుల రామ గౌడ్, పెండల గణేష్, బైరి నర్సింహా రెడ్డి, వాతం శివ, పడకండి విశ్వనాథం, ఎల్లప్పగారి పోచయ్య తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. చింతమడక గ్రామం కేసీఆర్ స్వగ్రామం కావడంతో ఈ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు భారీగా పాల్గొనే అవకాశం ఉందని ఆలయ కమిటీ తెలిపింది.వేడుకలను భక్తి భావంతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామంలో ఇప్పటికే ఉత్సవ వాతావరణం నెలకొంది. భక్తులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కేసీఆర్ హాజరైతే మరింత వైభవంగా జరగనున్నట్లు స్థానికులు భావిస్తున్నారు. గ్రామ ప్రజలు, భక్తులు ఆయన రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అప్పు వసూలు ఒత్తిడి ఆత్మహత్య ప్రేరేపణ కాదు


- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కేవలం డిమాండ్‌ను నేరంగా పరిగణించలేమని స్పష్టం
- గుజరాత్ కేసులో ఎఫ్ఐఆర్ రద్దు
- ఆధారాలు లేనప్పుడు కేసులు కొనసాగించరాదని వ్యాఖ్య



2

# సంకల్పంతో రూపుదిద్దుకున్న తెలంగాణ బడ్జెట్..

మెదటి పేజీ తరువాయి




సమావేశంలో బడ్జెట్‌కు ఆమోదం లభించగా, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. పాలకులుగా కాకుండా ప్రజాసేవకులుగా పరిపాలన సాగిస్తున్నామని, ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యాంగ విలువలకు కట్టుబడి పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొంది.ఈ బడ్జెట్‌లో అత్యంత కీలక ఆకర్షణగా "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనుంది. అదేవిధంగా చేయూత పథకం కింద 2 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయడం, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కొనసాగించడం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వంటి పథకాలు కొనసాగుతున్నాయి. మహిళా శక్తి మిషన్ ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు బడ్జెట్ దారితీసింది. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం ద్వారా విద్యార్థుల పోషకాహార స్థాయిని మెరుగుపరచనుంది. రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చి, కొత్తగా 15 కోర్సులను ప్రవేశపెట్టనుంది. ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2,000 స్కాలర్‌షిప్ అందించనుంది. 105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించడంతో పాటు ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 2,500 పాఠశాలలకు ప్రీ-ప్రైమరీ విభాగాలను విస్తరించనుంది.వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయిస్తూ రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ.12 వేల పెట్టుబడి సహాయం అందించనుంది. సన్నవడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.18 కోట్ల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కొనసాగుతుంది. సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు కేటాయించి పలు ఎత్తిపోతల పథకాలు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. విద్యుత్ రంగానికి రూ.21,285 కోట్లు, విద్యా రంగానికి రూ.26,674 కోట్లు, వైద్య ఆరోగ్య రంగానికి రూ.13,679 కోట్లు కేటాయించింది. ఆరోగ్య రంగంలో ప్రజల హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయడం, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మించడం, సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ ఆసుపత్రులు, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ప్రారంభించనుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేయనుంది.పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధికి కూడా పెద్దపీట వేసింది. మూసీ నది పునరుద్ధరణ, గోదావరి నీటిని తరలించడం, 39 ఎస్టీపీల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైలు, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం, పారిశ్రామిక హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల అభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.హోం శాఖకు రూ.11,907 కోట్లు కేటాయించి శాంతిభద్రతల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై దృష్టి సారించింది. 2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు రూ.500 కోట్లు కేటాయించింది. క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రణాళికలు రూపొందించింది. మొత్తంగా ఈ బడ్జెట్‌ను తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలకు ప్రతిబింబంగా ప్రభుత్వం పేర్కొంది. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగే విధంగా రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలుస్తుందని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# కుటుంబ సమేతంగా తిరుమలకు సీఎం చంద్రబాబు

**- దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు**

**- అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షల విరాళం**

**- తిరుమలలో రాత్రి బసడ రేపు దర్శనం**



తిరుమల, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుమల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన ఆయన వెంట అర్ధాంగి భువనేశ్వరి, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్ ఉన్నారు. కుమారుడు, మంత్రి నారా లోకేశ్ రాత్రికి తిరుమలకు చేరుకోనున్నారు.శనివారం (మార్చి 21) దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులంతా కలిసి ఉదయం శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. ప్రతి ఏడాది కొనసాగిస్తున్న ఆనవాయతీ ప్రకారం ఈసారి కూడా దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి సేవలో పాల్గొనాలని కుటుంబం నిర్ణయించింది. ఈ సందర్భంగా శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు నారా కుటుంబం తరఫున రూ.44 లక్షల విరాళాన్ని సమర్పించనున్నారు. ఒకరోజు అన్నవితరణ కార్యక్రమానికి అయ్యే మొత్తం వ్యయాన్ని భక్తి భావంతో అందించనున్నారు. ఈ సేవ ద్వారా అనేకమంది భక్తులకు అన్నదానం జరగనుంది.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో తిరుమలలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రత, వసతి, దర్శన ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కుటుంబం ఈ రాత్రి తిరుమలలోనే బస చేయనుంది. రేపు ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరిగి బయలుదేరనున్నారు. ఈ పర్యటన భక్తి, సంప్రదాయాల కలయికగా నిలుస్తోంది.

# గోదావరిలో విద్యార్థుల గల్లంతు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సరిహద్దు ప్రాంతం కూనవరం వద్ద గోదావరిలో స్నానం చేసేందుకు దిగిన విద్యార్థుల్లో ఐదుగురు గల్లంతైన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత విషాదకరమని పేర్కొంటూ తన ఆవేదనను తెలియజేశారు. ఉన్నత భవిష్యత్తు ఉన్న యువ విద్యార్థులు ఇలాంటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని జగన్ అన్నారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి బాధలో తాను భాగస్వామినని పేర్కొన్నారు. గల్లంతైన విద్యార్థులంతా అమరావతిలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారని వెల్లడించారు. విద్య కోసం ప్రయత్నిస్తున్న ఈ యువత ఇలా మృతి చెందడం రాష్ట్రానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు.ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం, మనోబలం మృతుల కుటుంబాలకు కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విద్యార్థుల మృతి పట్ల పలువురు నాయకులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# అప్పు వసూలు ఒత్తిడి ఆత్మహత్య ప్రేరేపణ కాదు

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం మాత్రమే ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఒక వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది. మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో, పలువురు రుణదాతలు వేధించారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసు కేసు నమోదు చేశారు. అందులో ఒకరైన ధీరూభాయ్‌పై ఐపీసీ సెక్షన్ 306, 506(2) కింద కేసు పెట్టారు.ఈ కేసులో ప్రాసిక్యూషన్ సమర్పించిన కాల్ రికార్డుల ప్రకారం నిందితుడు మృతుడికి పలుమార్లు ఫోన్ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సూసైడ్ నోట్‌లో పలువురి పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టత లేకపోవడం గమనించిందని తెలిపింది.రుణదాత ఫోన్ చేసి అప్పు తిరిగి ఇవ్వాలని అడగడం చట్టబద్ధమైన చర్యేనని కోర్టు స్పష్టం చేసింది. ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని పేర్కొంది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కూడా కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో నిందితుడిపై క్రిమినల్ కేసు కొనసాగించడం చట్ట దుర్వినియోగంగా మారుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌తో పాటు తదుపరి చర్యలను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి కేసులపై కీలక మార్గదర్శకంగా నిలవనుంది.

# అకాల వర్షాల దెబ్బ.....
## రైతులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**- నష్టపోయిన పంట పొలాల పరిశీలన**

**- 7080 ఎకరాల్లో వరి, ఇతర పంటలకు నష్టం**


**- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ**



చంద్రగిరి, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్ల వానతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా పంట నష్టపోయిన పొలాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన రైతులతో నేరుగా మాట్లాడారు. బందార్లపల్లి, రంగంపేట, కొటాల, పుల్లయ్యగారి పల్లి గ్రామాల్లో సుమారు 70 నుంచి 80 ఎకరాలకు పైగా వరి మరియు ఇతర పంటలు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే నాని, రైతుల సమస్యలను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. పంట నష్టంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.రైతులు అధైర్యపడొద్దని సూచించిన ఎమ్మెల్యే, పంట నష్టం విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడం తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. పంట నష్టం వివరాలను సేకరించి ప్రభుత్వం కు నివేదికలు పంపాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన ప్రతి రైతుకు సరైన సహాయం అందేలా సమగ్రంగా అంచనా వేయాలని సూచించారు. అధికారుల సమన్వయంతో త్వరితగతిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమస్యలను కూడా ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. స్థానిక అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల దెబ్బ..పంట నష్టంపై సీఎం సమీక్ష

**- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ- వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్న పరిస్థితి- రైతులకు అండగా చర్యలు వేగవంతం**



అమరావతి, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): అకాల వర్షాలు, భారీ గాలులు, వడగళ్ల వానల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పంట నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. క్యాంప్ కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో పంటల నష్టంపై వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 42 మండలాల్లో మొక్కజొన్న, వరి, మినుము పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు నివేదించారు. మొత్తం 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ పరిస్థితిపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయి. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, నిమ్మ, నారింజ పంటలు భారీగా నష్టపోయినట్లు అధికారులు వివరించారు. ఈ నష్టం రైతులకు తీవ్ర ఆర్థిక భారం కలిగించే అవకాశముందని పేర్కొన్నారు.పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తక్షణ సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో నష్టం వివరాలను వేగంగా సేకరించి నివేదికలు సమర్పించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించే దిశగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు

# ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి



హుస్నాబాద్ మార్చి//మనప్రజాప్రతినిధి. 20:కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ఆశా వర్కర్లకు సంబంధించి వారి యొక్క న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో తీవ్రంగా విఫలం కావడం జరిగింది. కామారెడ్డి డిక్లరేషన్లు లో భాగంగా ఆశా వర్కర్లకు నెలకు 18 వేల జీతం పెంచుతామని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆశా వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్న ప్రభుత్వం కు చీమకుట్టినట్టు కూడా అనిపించడం లేదని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని, ప్రభుత్వం పద్ధతి మార్చుకోవాలని బిఎస్పి పార్టీ పక్షాన కోరడం జరుగుతుంది. ఆశా వర్కర్ల డిమాండ్ల కొరకు బీఎస్పీ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరుగుతుంది.

# జీవో అమలై మూడు నెలలు గడుస్తున్న ఉద్యోగాలు రాని ఉద్యమ కళాకారులు




హుస్నాబాద్మార్చి.//మనప్రజాప్రతినిధి. 20 :హుస్నాబాద్ కళాకారులు ఉద్యమ నిరుపేద కళాకారులకు సాంస్కృతిక శాఖలో ఉద్యోగాల కల్పన అందని ద్రాక్ష లాగా మిగిలిందని అసెంబ్లీ సాక్షిగా కళాకారులకు ఉద్యోగాల కల్పన జీవో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి మూడు నెలలు గడుస్తున్న పట్టించుకోని సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు సాంస్కృతి శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్ మరియు సలహా మండలి సభ్యులు తెలంగాణ ఉద్యమం కోసం ఆడి పాడిన పేద కళాకారులకు సాంస్కృతిక శాఖలో ఉపాధి ఉద్యోగాల విషయంలో గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని ప్రజా ప్రభుత్వంలో నిరుపేద కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కొండంత ఆశతో ఉన్న కళాకారులకు ఎదురుచూపే మిగిలిందాని ఆవేదన వ్యక్తం చేశారు నిరుపేద కళాకారులను ఆదుకోకపోతే మళ్లీ రోడ్డెక్కి రిలే నిరాహార దీక్షలు చేస్తామని హుస్నాబాద్ ఉద్యమ కళాకారులు హెచ్చరించారుహుస్నాబాద్ ఉద్యమ కళాకారులు

# ఆశ కార్యకర్తలనుముందస్తు అరెస్టులు



హుస్నాబాద్ మార్చి//మనప్రజాప్రతినిధి20:ఆశ కార్యకర్తలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందిఅరెస్టులతో ఆశ కార్యకర్తల పోరాటాన్ని ప్రభుత్వం ఆపలేదుఆశా కార్యకర్తలను ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలి హుస్నాబాద్ బిఆర్ఎస్ పార్టీ డిమాండ్దన్యాయమైన డిమాండ్ లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు జిల్లాలోని మంత్రుల కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వాలనే పిలుపు మేరకు అందులో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కి వినతి పత్రం ఇవ్వాలని బయలుదేరితే మార్గమద్యంలోనే పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అరెస్ట్ అయిన కార్యకర్తలకు హుస్నాబాద్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపి ఆశా కార్యకర్తలతో కలిసి హుస్నాబాద్ విలేకరులతో మాట్లాడటం జరిగింది.ఆశా కార్యకర్తలకు న్యాయమైన డిమాండ్ల కోసం గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి అనేకసార్లు వినతి పత్రాల ద్వారా ఉద్యమాల ద్వారా తెలిపినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ,వాళ్ల కష్టార్జితంతో ఆటలాడుతూ వాళ్ళని ఇబ్బందులకు గురిచేస్తూ, పరిపాలన కొనసాగిస్తుందని బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య , అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి, బిఆర్ ఎస్ వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్ మాట్లాడుతూ,ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ఉద్యమాలు ఆపలేరని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా తప్పించుకోవడం కోసమే ఈ నిర్బంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.ఆశా కార్యకర్తలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని వాళ్ళ న్యాయమైన డిమాండ్స్ మాత్రమే కోరడం జరుగుతుంది. రోజంతా గ్రామాల్లో కష్టపడి చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతూ ప్రజల కోసమే సేవ చేస్తూ జీవిస్తున్నారు. వాళ్లకోసం ఆలోచించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తూ కాలయాపన చేస్తున్నది, ఉద్యోగ భద్రత లేకుండా ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు ప్రభుత్వం అనేకసార్లు పని ఒత్తిడి చేసిన కూడా కొద్ది జీతంతోనే పని చేస్తున్నారు. ఆశా కార్యకర్తలను వాళ్ళ డిమాండ్స్ పై చర్చ పెట్టకుండా వాళ్లను తీవ్ర ఇబ్బందుల గురి చేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పరిపాలన అని చెప్పుకుంటూ న్యాయమైన సమస్యలు అడిగిన వారిని నిర్బంధాలు చేస్తున్నది . ఈ రాష్ట్ర ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తప్పకుండా తగిన సమయంలో తగిన బుద్ధి చెప్పడానికి కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కనీసం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలను చర్చలకు పిలిచి న్యాయమైన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామని, లేకుంటే తప్పకుండా బిఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వికాస్ యాదవ్, యాస శ్రీనివాస్, నాగయ్య, ఆశా కార్యకర్తలు భాగ్య, వాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు .

# వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి వేములవాడ మున్సిపల్ చైర్మన్



మనప్రజాప్రతినిధి/వేములవాడమార్చి, 20 : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తుండటంతో వేములవాడ మున్సిపాలిటీలో 100% ఆస్తిపన్ను వసూలు చేయాలని చైర్మన్ పుల్కం రాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పన్నులు వసూలు చేయాలని సూచించారు.ముఖ్యంగా మొండి బకాయిదారుల విషయంలో చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణాభివృద్ధికి పన్నులే కీలకమని, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కమిషనర్ సంపత్ కుమార్, ఏఈ అనన్య, రెవెన్యూ మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లి పేరనున్న భూమిని సమానంగా పంచాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:అన్నదమ్ముల సమస్యలోకి పొంగులేటిని, దయాకర్రెడ్డిని లాగొద్దు తండ్రి పేరనున్న భూమిని కాజేసేందుకు యత్నంమీడియా సమావేశంలో కొప్పుల రమేష్ అన్నదమ్ములు తల్లి పేరనున్న భూమిని ఆమె ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వారసులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్క్లబ్లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కొప్పుల రమేష్, కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల జనార్ధన్, కొప్పుల జైపాల్, కొప్పుల నాగేశ్వరరావు తండ్రి జైపాల్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన వారు మీడియాతో మాట్లాడుతూ తీర్థాల రెవెన్యూలోని760 సర్వే నెంబర్లో కొప్పుల పేరమ్మ పేరు మీద ఉన్న 4.13 కుంటలు వౌాట్ట భూమిని కొప్పుల రామారావు తన భార్య సుధారాణి పేరు మీద, ఎకరం ఒక కుంట మాగాణిని అతని కొడుకు ప్రపుల్లకుమార్ పేరు మీద దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. ఇది తెలుసుకున్న రామారావు తల్లి వీరమ్మ దానిని రద్దు చేయించి, తన ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వీలునామా రాసిందని, అఫిడవిట్లో పేర్కొందనితెలిపారు. కొప్పుల పుల్లయ్య పేరు మీద ఉన్న 5 ఎకరాల 32 కుంటల భూమిని అక్రమంగారిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామారావు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇది అన్నదమ్ముల, పాలెభాగాల సమస్య అని అన్నారు. ఇందులోకి అనవసరంగా మంత్రి పొంగులేటిని, ఆయనక్యాంప్ ఆఫీస్ ఇన్ఛార్జి దయాకర్రెడ్డిని లాగుతున్నారని, ఇది సరి కాదని పేర్కొన్నారు. తమ సమస్యకు, పొంగులేటికి, దయాకర్రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి అంటే గిట్టని వారు కొప్పుల రామారావు, జగదీష్తోటి రాజకీయంగా పూయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.తమ సమస్యను తామే పరిష్కరించకుంటామన్నారుదీనికి రాజకీయం పూయవద్దని సూచించారు.

# అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేసిన రాష్ట్ర బడ్జెట్

**-బడ్జెట్లో గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లు కేటాయింపు.-రాష్ట్ర బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేసిన గిరిజన కాంగ్రెస్ నేత డి.టి నాయక్**



హుస్నాబాద్ మార్చి.//మనప్రజాప్రతినిధి. 20:రాష్ట్ర బడ్జెట్లో గిరిజనుల సంక్షేమానికి 12600 కోట్లు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి సహచర మంత్రివర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర గిరిజన నేత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు ధరావత్ తిరుపతి నాయక్ అన్నారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనరంజక బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తూ సంక్షేమానికి అత్యధిక నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమని ఆయన అన్నారు.తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్లో రూ.12,600 కోట్లు కేటాయించిందని, ఈ నిధులను 'ఇందర సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా ఖర్చు చేయనుంది. ఈ పథకం ద్వారా 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపు సెట్లను అందించి, ఆరు లక్షల ఎకరాల పోడు భూముల్లో తోటల పెంపకాన్ని ప్రోత్సహించి, 2.10 లక్షల గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారని అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ పథకాన్ని అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని అనడం ఎంతో సంతోషకరమైన విషయమని డి.టి నాయక్ అన్నారు.

# సిరిసిల్లలో చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్ట్ ఇద్దరు రిమాండ్కు తరలింపు



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల మార్చి ,20:చిరునామా అడిగే నెపంతో మహిళ మెడలోని పుస్తెల తాడును తెంచుకెళ్లిన ఇద్దరు నిందితులను సిరిసిల్ల పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుండి బంగారు పుస్తెలు, బైక్ మరియు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు.ఈ నెల 17వ తేదీ (17-03-2026) రాత్రి సమయంలో సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయినగర్కు చెందిన మేర్గు లత తన ఇంటి గేటు వద్ద ఉండగా, మోటార్ సైకిల్పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడ్రస్ అడుగుతున్నట్లు నటించారు. ఆమె అప్రమత్తంగా లేని సమయంలో ఒక్కసారిగా మెడలోని పుస్తెల తాడును తెంచుకుని వేగంగా పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారుజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు, పట్టణంలోని సీసీ కెమెరాల ఫుటేజీని మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని విశ్లేషించారు. నిందితులు సిరిసిల్ల వైపు వస్తున్నారన్న సమాచారంతో రడుగు చౌరస్తా వద్ద మాటు వేసి వారిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వివరాలూా1 - సయ్యద్ మౌలాన (22): తండ్రి బడే సాబ్, నివాసం: తుర్కశినగర్, కొడిమ్యాల మండలం, జగిత్యాల జిల్లా.ూా2 - మంగురు ప్రకాష్ యాదవ్ (19): తండ్రి ధర్మేందర్, నివాసం: వేదిరే గ్రామం, రామడుగు మండలం, కరీంనగర్ జిల్లా.స్వాధీనం చేసుకున్న సొత్తురెండు బంగారు పుస్తెలు (బరువు 4.4 గ్రాములు)నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనంరెండు మొబైల్ ఫోన్లుప్రజలకు పోలీసుల విజ్ఞప్తి:ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పేర్కొన్నారు."ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి."నిందితులను అరెస్ట్ చేసి నేడు రిమాండ్కు తరలించినట్లు ఆయన స్పష్టం చేశారు

# తూప్రాన్ డిసిసి ఉపాధ్యక్షుడిగా గడప దేవేందర్



మెదక్ జిల్లా//మనప్రజాప్రతినిధి: జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా తూప్రాన్ పట్టణానికి చెందిన గడప దేవేందర్ నియకమయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గురువారం నియామకపు ఆదేశాలు జారీ చేశారు జిల్లా మత్స్యశాఖ చైర్మన్గా కొనసాగుతున్న గడప దేవేందర్ టిసిసి ఉపాధ్యక్షుడిగా నియకమయ్యారు డిసిసి ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు మైనంపల్లి హనుమంతరావుకు, ఎమ్మెల్యే రోహిత్ రావుకు, కృతజ్ఞతలు తెలిపారు

# రుద్రంగి మండలంలో చిరుతపులి కలకలం



ప్రజలకు పోలీసుల హెచ్చరిక మనప్రజాప్రతినిధి /వేములవాడ మార్చి 20:రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. నిన్న రాత్రి మండల పరిధిలో చిరుతపులి ఒక కుక్కపై దాడి చేసి చంపడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రుద్రంగి ఎస్ఐ గారు ప్రజలను అప్రమత్తం చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారుచిరుతపులి సంచారం నేపథ్యంలో ప్రజలు కింది జాగ్రత్తలు పాటించాలని అటవీ మరియు పోలీస్ శాఖలు కోరుతున్నాయి అర్ధరాత్రి మరియు తెల్లవారుజామున ఒంటరిగా బయటకు వెళ్లడం ప్రమాదకరం. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు.పిల్లల పట్ల జాగ్రత్త: చిన్న పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా బయటకు పంపకూడదు. ఎప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండాలి. పశువుల కొట్టాలు మరియు పెంపుడు జంతువులను సురక్షితమైన ప్రదేశాల్లో ఉంచాలి. గొర్రెలు, మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలి. గ్రామం బయట ప్రాంతాలకు లేదా వ్యవసాయ పొలాలకు వెళ్లేటప్పుడు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లడం శ్రేయస్కరం.చిరుతపులి ఎక్కడైనా కనిపిస్తే దానిని వేధించడం లేదా భయపెట్టడం వంటివి చేయకూడదని అధికారులు తెలిపారు. వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.ప్రజల రక్షణ కోసం పోలీస్ యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుందని, గ్రామస్థులు భయపడకుండా అప్రమత్తంగా ఉండి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


# మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా శ్రీ బెండ రమేష్

మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా శ్రీ బెండ రమేష్ (బొల్లారం) గారి నియ మిస్తూ కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులు జారీ చేసినందుకుగాను మెదక్ జిల్లా:- మెదక్ మండలం గ్రామం బొల్లారం మన ప్రజాప్రతినిధి// మెదక్ : తేదీ:-19/3/26 జనరల్ సెక్రెటరీగా అవకాశం ఇచ్చినటు వంటి కాంగ్రెస్ పార్టీ మైనంపల్లి హనుమంతరావు మరియు మైనంపల్లి రోహిత్ మెదక్ ఎమ్మెల్యే మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారికి ధన్యవాదములు




# ముస్లిం సోదరులకు...
# రంజాన్ శుభాకాంక్షలు

**-దాన ధర్మాలతో సమానత్వానికి బాట**
**-శాంతి సౌభ్రాతృతత్వానికి పండగ ప్రతీక..**
**-ఉపవాసం ప్రార్థనలతో ఆత్మ శుద్ధి సందేశం.**
**-మతసామరస్యానికి ప్రత్యేకగా రంజాన్ పండుగ**
**-ప్రజాప్రతినిధి పత్రిక చైర్మన్ శ్రీనివాస్..**



మనప్రజాప్రతినిధి//శ్రీనివాస్:పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ నెలలు ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆత్మ శుద్ధికి, సద్గుణాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం శాంతి ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని అల్లాహ్ దయతో ప్రతి ప్రార్థన ఫలించి కోరికలు నెరవేరాలని ఆకాంక్షిస్తున్నారు రంజాన్ పండుగ మానవత విలువలకు ప్రతీకగా నిలుస్తూ సమాజంలో శాంతి పెంపొందించే పవిత్ర పండగ రంజాన్ క్రమశిక్షణతో చేసే ప్రార్థనలు జకాత్, పిత్ర రూపంలో పేదలకు సహాయం చేయడం మానవాళికి గొప్ప సందేశమని ఆయన తెలిపారు ఈ ఆచారాలు సమాజంలో సహానుభూతి సేవా భవాని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు అన్ని మతాలు వర్గాలు కలిసిమెలిసి జీవించే సంస్కృతి రాష్ట్రానికి ప్రత్యేకత అని ఆయన గుర్తు చేశారు.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం 8 మంది మృతి



సేలం, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు రాష్ట్రంలోని సేలం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తమసోలాపురం సమీపంలోని అరియనూర్ వద్ద తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. కోయంబత్తూరు నుంచి సేలంకు వెళ్తున్న ఈ బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణం మధ్యలో బస్సు అదుపు తప్పి అవతలి లైన్‌లోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి.బస్సు ఢీకొన్న వాహనాల్లో గూడ్స్ ఆటో, ద్విచక్ర వాహనం ఉన్నాయి. ఆటోలో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది ప్రయాణిస్తుండగా, వారు ఓ కార్యక్రమం ముగించుకుని తిరిగి వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై ఓ మహిళ, ఆమె చిన్నారి ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు, ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు మృతి చెందారు. మృతి చెందిన వారిని సెల్వరాజ్, మురుగన్, అముధ, మణికందన్, ఇరుసాయి, సత్య, ఐదేళ్ల నితీష, 11 నెలల జీవికగా గుర్తించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బస్సులోని కొంతమంది ప్రయాణికులు గాయపడగా, వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అతివేగం కారణంగా డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

# జిల్లా ప్రజలకు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ శుభాకాంక్షలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్జిల్లా ప్రజలకు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన ధర్మాల (జకాత్) ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ శాంతి, సౌహార్ద్రం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, మత సామరస్యంతో ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రత ఏర్పాట్లు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా :పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంఖమ్మం కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈద్గా ప్రాంతాల్లో ముస్లిం సోదరుల సామూహికంగా ప్రార్థనలు దృష్టిలో ఉంచుకొని శుక్రవారం నగరంలోని గోళ్లగూడెం ఈద్గా ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలసి పోలీస్ కమిషనర్ సందర్శించారు. ట్రాఫిక్, పార్కింగ్, భద్రతపై నిర్వహకులతో పాటు అధికారులతో చర్చించారు. ప్రత్యేక ప్రార్థన కోసం వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పండుగ సందర్భంగా పార్కింగ్ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ముస్లిం సోదరులు రంజాన్ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులతో కలిసి అనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఇన్స్పెక్టర్లు భానుప్రకాష్, సత్యనారాయణ, రాజిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధి పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మనప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 20 మార్చ్ :సమాజ శ్రేయస్సు కోసం వార్తా సంస్థలు నిరంతరం కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎంపీ క్యాంప్ ఆఫీసులో 'మన ప్రజా ప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ యొక్క నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. 'మనప్రజాప్రతినిధి' పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. తన చేతుల మీదుగా ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.పత్రికలు మరియు టీవీ ఛానళ్లు సామాజిక బాధ్యతతో పనిచేయాలని, ప్రజల గొంతుకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.మీడియా రంగంలో 'ప్రజా ప్రతినిధి' సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.పత్రిక అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 'ప్రజా ప్రతినిధి' జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పులి మల్లేశం, మానకొండూరు అసెంబ్లీ రిపోర్టర్ బత్తిని ఆంజనేయులు, సిరిసిల్ల రిపోర్టర్ టి.శ్రీను మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ కోసం ప్రజల కష్టాలు



అనకాపల్లి, మార్చి 20 (మనప్రజాప్రతినిధి): అనకాపల్లి జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చోడవరం, రావికమతం మండలాల్లో పరిస్థితి మరింత విషమంగా మారింది. గ్యాస్ సిలిండర్ కోసం ప్రజలు ఎండలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ కష్టాలు మరింతగా కనిపిస్తున్నాయి. గ్యాస్ కోసం భారీగా డిమాండ్ పెరగడంతో సరఫరా తక్కువగా ఉండటం సమస్యకు కారణమవుతోంది. సిలిండర్ పొందేందుకు ప్రజలు ఉదయం నుంచే క్యూల్లో నిలబడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో క్యూలైన్లు సుమారు 500 మీటర్ల వరకు కొనసాగుతున్నాయి. మహిళలు, వృద్ధులు కూడా ఈ క్యూల్లో నిలబడాల్సి రావడం ఆందోళన కలిగిస్తోందిస్థానికులు చెబుతున్న ప్రకారం, సరఫరా సరిపడా లేకపోవడంతో రోజులు గడిచినా సిలిండర్ అందడం లేదు. కొందరు పలుమార్లు వచ్చి తిరిగి వెళ్తున్న పరిస్థితి నెలకొంది. గ్యాస్ లేకపోవడంతో వంట చేయడం కష్టంగా మారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రత్యామ్నాయంగా కట్టెల వంటకు కూడా మారాల్సి వస్తోందని వారు తెలిపారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. సరఫరాను పెంచి ప్రతి ఒక్కరికీ సమయానికి గ్యాస్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద నిర్వహణలో లోపాలు ఉన్నాయని కూడా ఆరోపిస్తున్నారు. వేసవిలో ఇలాంటి పరిస్థితులు మరింత కష్టంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రజల ప్రాథమిక అవసరమైన గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.